క్లుప్తంగా

గర్భిణులకు సామూహిక సీమంతం



కొత్తపల్లి(గంపలగూడెం):గర్భిణులు, బాలింతలు తమ బిడ్డలు ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఎమ్మెల్యే రక్షణనిధి తెలిపారు. కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పది మంది గర్భిణులకు నిర్వహించిన సామూహిక సీమంతంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో కావాల్సిన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందజేసి, ఆటపాటలతో ప్రతిరోజు కేంద్రాలకు వచ్చేలా పనిచేయాలని సూచించారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, ఎంపీటీసీ సభ్యులు పగడాల పద్మ, మాజీ సర్పంచ్ వంగల వైకుంఠం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి పాల్గొన్నారు.

స్థానికులకే సీటు ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్

కుంటముక్కల(జి.కొండూరు): అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీలు స్థానికులకే సీట్లు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్ బాబు తెలిపారు. కుంటముక్కల గ్రామంలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడారు. గడచిన రెండు దశాబ్దాలుగా పక్క నియోజకవర్గం నుంచి వచ్చిన వ్యక్తులకు ప్రధాన పార్టీలు సీట్లు కేటాయిస్తున్నారని చెప్పారు. దీంతో వారు స్థానికులపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. గత రెండు దశాబ్దాలుగా ఇదే తంతు కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికైనా పొరుగింటి పెత్తనానికి స్వస్తి పలకాలన్నారు.

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

చాట్రాయి : మండలంలో నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్.మురళీమోహనరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నాడు నేడు పనుల పురోగతిపై సచివాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాల్లో ఇప్పటి వరకు ఏయే పనులు ఎంత వరకు అయ్యాయి, ఇంకా ఎన్ని నిధులు ఉన్నాయి, మిగిలిన నిధులకు సరిపడా పనులపై సమీక్ష నిర్వహించారు. ఎంఈవో బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్ సేవలు చిరస్మరణీయం

మైలవరం:భారతదేశ మాజీ ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత లాల్ బహదూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం తెలిపారు. జైజవాన్, జైకిసాన్ నినాదంతో ప్రజలను చైతన్య పరిచిన గొప్ప దార్శనికులు అని కొనియాడారు. ఈ సందర్భంగా శాస్త్రికి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ నివాళులర్పించారు.

14 నుంచి నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు

ఎ.కొండూరు:సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయిలో మండలంలోని కోడూరు గ్రామంలో 14 నుంచి 16వ తేదీ వరకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు మల్లాది రమేష్ బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ. 10,016, రెండవ బహుమతి రూ. 7,016, మూడవ బహుమతి రూ. 4,016, నాలుగవ బహుమతి రూ. 2016 అందజేస్తామన్నారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు సెల్. 6281112511, 7799558274 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు : యల్లాపురంలో మంగళవారం రాత్రి పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని రూ.1,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని గురువారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు చెప్పారు. కోడిపందేలు, జూద శిబిరాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.కుటుంబరావు హెచ్చరించారు. ముసునూరులో ఆయన తన సిబ్బందితో కలసి కోడికత్తుల తయారీదారులపై బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో కొండపల్లి రమేష్ వద్ద 30 కత్తులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, బైండోవర్ విధించినట్లు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ

తిరువూరు:స్థానిక అక్షర డిగ్రీకళాశాల విద్యార్థి చెరుకు శివతేజ కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకం లభించినట్లు కళాశాల డైరెక్టర్ ఏ ఆర్ ధనుంజయ తెలిపారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శివతేజను కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు





భోగి మంటల్లో ఆవు పిడకలు వేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, మైలవరంలో చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న తల్లిదండ్రులు, టీచర్లు

నూజివీడు : తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేది సంక్రాంతి పండుగ అని, ఈ పండుగ గొప్ప తనాన్ని నేటి విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పట్టణంలోని సాయి ప్రణీత హైస్కూల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ సంస్కృతిలో పండుగలన్నీ సమాజానికి, ప్రజలకు మేలు చేసేవేనని అన్నారు. ప్రజలందరూ సంక్రాంతి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. విద్యార్థులు ఆవు పిడకలతో భోగి మంటలను వెలిగించడంతో పాటు బొమ్మల కొలువులు, గంగిరెద్దుల ఆటపాటలు, విన్యాసాలు, కోలాటాలు, పిట్టలదొర మాటలు, హరిదాసుల కీర్తనలతో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. కుమార్‌స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. దీనిలో భాగంగా పిల్లలకు భోగి పళ్లు పోశారు. ఏపీ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల రామస్వామి, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు:సంక్రాంతి వేడుకలను పట్టణంలోని విద్యాసంస్థల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిభ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. శ్రీనిధి స్కూల్లో స్వామి వివేకానంద, సరస్వతీ దేవి విగ్రహాలను వైద్య నిపుణులు తాళ్ళూరి రామకోటేశ్వరరావు ఆవిష్కరించారు. బొమ్మల కొలువు, భోగిపళ్ళు పోసే కార్యక్రమాలను ఉపాధ్యాయులు నిర్వహించారు. సాయి డిగ్రీ కళాశాల, గీతమ్స్ స్కూల్, ఎర్రమాడు ఎంపీయూపీ స్కూల్లో సంక్రాంతి సంబరాలు చేశారు.

జూపూడి(ఇబ్రహీంపట్నం):భారతీయ సంస్కృతి సంప్రదాయాలు కాపాడు కోవాలని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. జూపూడి సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. సర్పంచ్ కాకి దేవమాత ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ జోత్స్న పాలు పొంగించి భోగి మంటలు వేశారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. హరిదాసుల వేషధారణలో అలరించారు. మహిళలు మ్యూజికల్ చైర్స్ పోటీల్లో తలపడ్డారు. గంగిరెద్దుల విన్యాసాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో రామకృష్ణనాయక్, తహసీల్దార్ సూర్యారావు, వైస్ ఎంపీపీ బాజావత్ బాలనాగమ్మ, కార్యదర్శి మునేశ్వర రావు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఎంపీయూపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసి భజనతో ఆకట్టుకున్నారు. చిన్నారులు వివిధ వేషధారణలో అలరించారు. హెచ్ఎం లీలాకుమారి, ఎస్ఎంసీ చైర్మన్ పిల్లి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



జూపూడిలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎంపీపీ జోత్స్న, ఎంపీడీవో రామకృష్ణనాయక్

మైలవరం:సంక్రాంతి పండుగ తెలుగు సంస్కృతి, సంప్రదాయాన్ని తెలియజేస్తుందని కరస్పాండెంట్ రాజారెడ్డి తెలిపారు. మైలవరం వివేకానంద హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు బుధవారం నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. భోగి మంటలు వేసి, పొంగళ్లు చేశారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఉపాధ్యాయుల సంక్రాంతి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా బాలబాలికలు వస్త్రధారణ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. నారాయణ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఉదయం నుంచే విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో వచ్చి ముగ్గులు వేశారు.

మామిడి మండలు, చెరుకు గడలు, అరటి పిలకలు కట్టి అలంకరణ చేశారు. సంక్రాంతి పొంగలి వండి అందరికీ పంపిణీ చేశారు. గంగిరెద్దు ఆటలు, హరిదాసుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భోగిపళ్ళు పోశారు. ఏజీఎమ్ హరీష్, ఆర్ఐ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



కొటికలపూడిలో వివిధ వేషధారణలలో అలరిస్తున్న పాఠశాల విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

చాట్రాయి : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం కేపీ ప్రాథమిక పాఠశాల, ఆరుగొలను యూపీ పాఠశాలల్లో విద్యార్థులు రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి పాటలు పాడుతూ భోగి మంటలు వేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉత్సవంలో పాల్గొన్నారు. పోలవరం పాఠశాలలో విద్యార్థులు వేసిన ముగ్గులను పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ పరిశీలించి బహుమతులు అందజేశారు. హెచ్ఎంలు ఆర్.నాగేశ్వరరావు, కె.నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తూరు తాడేపల్లి జిల్లా పరిషత్ స్కూల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు

విజయవాడరూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్తూరు తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 69 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడంతో స్కూల్లో సందడి నెలకొంది. సంస్కృతి సాంప్రదాయలకు అనుగుణంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ తృతీయ మూడు విభాగాల నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి బహుమతులు అందచేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కమలాకరరావు మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ షేక్ బాజీ, పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎంపీపీ రామినేని దేవి ప్రవల్య, సర్పంచ్ మల్లాది రాణీ, వైఎస్సార్ సీపీ నాయకులు రామినేని వీరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్

నూజివీడు: యువత క్రీడల్లో రాణించడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అన్నారు. ధర్మ అప్పారావు కళాశాల ఆవరణలో శ్రీరాజా వెంకటాద్రి అప్పారావు బహద్దూర్ 46వ స్మారక జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలను బుధవారం రాత్రి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని తెలిపారు. మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థి దశలోనే తర్ఫీదునిచ్చినట్లయితే గ్రామస్థాయి నుంచి కూడా మేటి క్రీడాకారులు తయారవుతారన్నారు. బాస్కెట్‌బాల్ పోటీలకు పుట్టినిల్లు అయిన నూజివీడులో 46 ఏళ్లగా టోర్నమెంట్ నిర్వహించడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. క్రీడాకారులను చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గకు పరిచయం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 28 పురుషుల జట్లు, తొమ్మిది మహిళల జట్లు వచ్చాయి. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ అంజాద్‌అలీ, సీనియర్ బాస్కెట్‌బాల్ ప్లేయర్ జల్లు మధు, నిర్వాహక కమిటీ సభ్యులు కె.గణేష్‌బాబు, సెక్రటరీ పి.సాధన తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహణ

నూజివీడు : కేంద్ర యువజన వ్యవహారాలు, నెహ్రూ యువకేంద్రం, రత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని డీఏఆర్ కళాశాలలో బుధవారం విలేజ్ క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమార్, ట్రస్టు సభ్యులు బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. దీనిలో భాగంగా బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, 100 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు మెడల్స్, ట్రోఫీలను అందజేశారు. నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి బీమాల వినోద్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

జూదాలకు దూరంగా ఉండాలి

నూజివీడు : యువత జూదాలు ఆడి విలువైన భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, జూదాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని హనుమంతులగూడెంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. రామకృష్ణ మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందిస్తామన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన



గణపవరంలో మామిడి తోటను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త స్రవంతి

గణపవరం(మైలవరం):మామిడిలో తెగుళ్ల నివారణకు పిప్రోనిల్ 2 మిల్లీలీటర్‌లు, ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 మిల్లీ లీటర్‌లు, వేప నూనె 10 వేల పీపీఎమ్ 1 మిల్లీలీటర్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని శాస్త్రవేత్త డాక్టర్ జి. స్రవంతి రైతులకు సూచించారు. మైలవరం మండలం గణపవరం గ్రామంలోని మామిడి తోటలను నూజివీడు మామిడి పరిశోధన స్థానం నుంచి కీటక శాస్త్రవేత్త డాక్టర్ జి. స్రవంతి బుధవారం సందర్శించారు. ఇన్‌చార్జి ఉద్యాన అధికారి ఎస్. అహ్మద్, గ్రామ ఉద్యాన సహాయకులు బి. మహేష్ పాల్గొన్నారు.

విజయవాడరూరల్: మామిడి పూతదశలో వచ్చే నల్లి పురుగును నివారించడానికి రైతులు వెంటనే చర్యలు తీసుకోవాలని మామిడి పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ జి.స్రవంతి రైతులకు సూచించారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని తోటలను బుధవారం ఆమె పరిశీలించారు. మామిడి తోటల్లో పిందెదశలో వున్న వాటిని ఆమె క్షుణ్ణంగా పరిశీలించి వాటిలో నల్లి పురుగు ప్రభావం వున్నట్టు గుర్తించారు. గత సీజన్లో మిర్చి పంటకు నల్లి పురుగు వ్యాపించడం వలన మిర్చి రైతులు అనేక జిల్లాల్లో ఎంతో నష్టపోయారని అన్నారు. మామిడి తోటల్లోకి వరదల్లాంటి నీటితో నీరు పెట్టకుండా డ్రిప్ ఇరిగేషన్ ఉపయోగించాలన్నారు. మామిడి రైతులు,గ్రామ ఉద్యాన సహాయకులు షేక్ ఫైజా,విక్టర్ క్యామ్, పాల్గొన్నారు.

నూజివీడు : రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మామిడిలో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించొచ్చని మామిడి శాస్త్రవేత్త కె.రాధారాణి అన్నారు. మండలంలోని తుక్కులూరులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో బుధవారం మామిడి రైతులకు అవగాహన సదస్సును స్థానిక రైతుభరోసా కేంద్రంలో నిర్వహించారు. రాధారాణి మాట్లాడుతూ తోటలో ఎండుపుల్లలు, కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ తొమ్మండ్రు బుజ్జి, ఉద్యాన అధికారిణి ఆర్ హేమ, వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం

ఎమ్మెల్యే కె. రక్షణనిధి



కొత్తపల్లిలో సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న రక్షణనిధి

కొత్తపల్లి(గంపలగూడెం):అధికార యంత్రాంగంతో కలిసి గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుకొని వెంటనే తగిన పరిష్కార చర్యలు చేపట్టేందుకే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఎమ్మెల్యే కె. రక్షణనిధి తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 111వ రోజు, గంపలగూడెం మండలం కొత్తపలి సచివాలయం పరిధిలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు తన దృష్టికి తెచ్చిన డ్రైనేజీ సమస్య పరిష్కారానికి సచివాలయ అభివృద్ధి నిధుల నుంచి రూ.6 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. గతంలో పంపిణీ చేసిన నివేశన స్థలాలు నివాసయోగ్యంగా లేవంటూ ఎస్సీ కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని రద్దుపరచి అందరికీ స్థలం కొనుగోలుచేసి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ శ్మశానవాటి ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకొంటామన్నారు. దీర్ఘకాలంగా గ్రామస్తులు ఎదురుచూస్తున్న ఎస్టీ రోడ్డు నుంచి కొత్తపల్లి శివారు తెలంగాణ సరిహద్దు వరకు జిల్లా పరిషత్ రహదారి డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు నెలరోజుల్లో పూర్తవుతాయని వివరించారు. దీనికై రూ.4 కోట్లు నిధులు విడుదలయ్యాయని వెల్లడించారు. కట్టిలేరు వంతెన నిర్మాణం కూడా అతి త్వరలో చేపట్టి 40 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో మంచి నీటి సమస్య పరిష్కారానికి రూ.46 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ నిధులతో ఒడ్డు ప్రాంతంలో ఒకటి , బీసీ కాలనీ సమీపంలో మరో వాటర్ ట్యాంక్ నిర్మాణంతో పాటు జలజీవన్ మిషన్‌లో మంజూరైన రూ.35 లక్షలుతో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్, పైప్‌లైన్ విస్తరణ చేపడతామన్నారు. సర్పంచ్ నరెడ్ల ఓగిరెడ్డి, మాజీ సర్పంచ్ వంగల వైకుంఠం, ఉప సర్పంచ్ గద్దల ముత్తయ్య, ఎంపీటీసీ సభ్యులు పగడాల పద్మ, ఏఎంసీ చైర్మన్ ఎస్.నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గోగుమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ నర్సారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి, ఉమా, బొల్లా కరుణాకరరావు, పద్మారెడ్డి, ఎం.నాగమల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పి.ఆంజనేయులు, లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ చైర్మన్ డి.నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కూడార్లై ఉత్సవం



కూడార్లైలో పాల్గొన్న భక్తులు

గంపలగూడెం:ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని ఆలయాల్లో కూడార్లైను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయం, భజనమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాయసాన్నం తయారు చేసి 108 గంగాళాల్లో ఉంచి కృష్ణపరమాత్మునికి నైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. మహిళలు తిరుప్పావై పఠనం, శ్రీకృష్ణాష్టకం, గోదా చతుర్లోకి పారాయణం గావించారు. రామాలయంలో దీపోత్సవం కనులవిందుగా చేశారు. కృష్ణపరమాత్మ, గోపిక ఆకారంలో రంగులు పూలతో చిత్రీకరించి చుట్టూ ప్రమిదలు ఉంచి దీపోత్సవం నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు...

తిరువూరు: ధనుర్మాస సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో కూడార్లై ఉత్సవం నిర్వహించారు. వేంకటాచలస్వామి దేవస్థానం, రాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి ఆలయం, పాత తిరువూరు రామాలయం, రాజుపేట వీరాంజనేయ స్వామి దేవస్థానం, కోదండ రామాలయాల్లో 108 రకాల ప్రసాదాలతో నివేదన చేశారు. సేవాకాలం, తిరుప్పావైలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు



నరసింగపాలెంలో లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ, ప్రజల జీవితాలను మార్చిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని నరసింగపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు అగ్రవర్ణాల మహిళలకు సైతం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలన క్షేత్రస్థాయికి తీసుకుని వచ్చిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ సర్పంచ్ మొగదాటి అనూషా పురుషోత్తం, తోటపల్లి ఎంపీటీసీ చింతా శ్యామల, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి మద్యా హరిబాబు, నాయకులు సూరానేని సత్యంబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పొన్నం వెంకట రామచంద్రరావు, ఎంపీపీ అనూషా ఇసాక్, జెడ్పీటీసీ వీరబాబు, మాజీ ఎంపీటీసీ మందపాటి విజయకుమార్, మనోహరం, ఇతర నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోడిపందేల బరులపై దాడి

ముసునూరు : లోపూడి మామిడితోటలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరిని బుధవారం తహసీల్దార్ దాసరి సుధ, సిబ్బంది ధ్వంసం చేశారు. బరిచుట్టూ ఏర్పాటు చేసిన భద్రతా వలయపు ముళ్లకంచెను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దాసరి సుధ మాట్లాడుతూ కోడిపందేలు, జూదశిబిరాల నిర్వహణపై ఉక్కు పాదం మోపుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదని, కేసులు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్ఓ నవీన్, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గంపలగూడెంలో గడ్డివామి దగ్ధం

గంపలగూడెం: మండల కేంద్రంలోని మార్కెటింగ్ యార్డు సమీపంలోని ఎన్టీఆర్ కాలనీలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము దగ్ధమైంది. కాలనీకి చెందిన రైతు పోతురాజు ముత్యాలరావు తనకు చెందిన ఖాళీ స్థలంలో నాలుగు ఎకరాల విస్తీర్ణం గడ్డిని కొనుగోలు చేసి రెండు వాములు ఏర్పాటు చేశాడు. ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డివాముకు నిప్పుఅంటుకుని కాలిపోయింది. చుట్టుపక్కల వారు మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కనిపించలేదు. ఒక వాము పూర్తిగా, రెండవ వాము సగం తగలబడింది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఘటనలో సుమారు రూ. 90 వేల గడ్డినష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణం తెలియలేదు.

రెండు పూరిళ్లు దగ్ధం

ఎ.కొండూరు:ప్రమాదవశాత్తు రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన రామచంద్రాపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జి. వెంకటేశ్వరరావు, జి. సురేష్‌లకు చెందిన రెండు పూరిల్లు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు దగ్ధమై బాధితులు కట్టుబట్టలతో నిరాశ్రయలయ్యారు. తహశీల్దార్ దాట్ల వెంకటేశ్వర్లు ఘటన స్థలానికి చేరుకుని బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. సర్పంచ్ ముచ్చు సీతయ్య రూ. 5వేలు, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి రూ. 5వేలతో పాటు బియ్యాన్ని బాధితులకు అందజేశారు. ప్రభుత్వం పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. విద్యుదాఘాతంతో ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

మల్లేల(తిరువూరు):మండలంలోని మల్లేలలో బుధవారం మృతి చెందిన మల్లె సుజాత అనే మహిళ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేశారు. రూ.10 వేల ఆర్థికసాయాన్ని సర్పంచ్ వంగూరి మరియమ్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కలకొండ రవికుమార్ మృతురాలి కుటుంబసభ్యులకు అందజేశారు.

ఓవరాల్ చాంపియన్ జాకీర్‌హుస్సేన్ కళాశాల



ఇబ్రహీంపట్నం: జాకీర్ హుస్సేన్ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ బాడీ బిల్డింగ్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో జాకీర్‌హుస్సేన్ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. పీబీ సిద్ధార్థ కళాశాల మహిళలు, పురుషుల విభాగంలో రన్నర్స్‌గా గెలుపొందారు. కేరళ రాష్ట్రంలో జరగనున్న ఆలిండియా అంతర్ యూనివర్సిటీ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్.మహబూబాషా తెలిపారు. యూనివర్సిటీ స్ట్రాంగ్ ఉమెన్‌గా జగ్గయ్యపేటకు చెందిన తిరుపతమ్మ, స్ట్రాంగ్ మెన్‌గా కేబీఎన్ కళాశాలకు చెందిన భరత్ కుమార్ నిలిచారు. విజేతలకు తహసీల్దార్ సూర్యారావు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.